క్లుప్తంగా

పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న ముదిరాజ్‌లు

శంకరపట్నం: కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని కొత్తగట్టు పెద్దమ్మ గుడి పూర్తిగా పోతుందని పరిహారం ఇప్పించాలని ముదిరాజ్‌లు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు విన్నవించారు. గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమెల్యే సానుకూలంగా స్పందించారని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పప్పు ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ చైర్మన్ మల్హర్రావు, సతీష్‌రెడ్డి, సంపత్, అనిల్, సమ్మయ్య, రవి,ఉన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారెడ్డి

గన్నేరువరం: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా సర్పంచులు కృషి చేయాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పల్లె ప్రగతి, పారిశుధ్యం, స్వచ్ఛ భారత్ మిషన్‌పై సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. మరుగుదొడ్ల వాడకం, చెత్తాచెదారం సక్రమంగా నిర్వహణ, మురుగునీరు తొలగింపు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహారెడ్డి, ఏబీఎం కోఆర్డినేటర్లు రమేష్, వేణు, రవీందర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ. 51 వేల విరాళం


చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి చొప్పదండికి చెందిన కర్ర వ్యాపారి కొంగ గట్టయ్య, రాజేశ్వరి దంపతులు మంగళవారం రూ. 51,116 విరాళం ఆలయ చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి అందించారు. కార్యక్రమంలో దండె లింగయ్య, దూస రాము, దూస లక్ష్మీనర్సయ్య, కటికం మహేశ్, కొల్లూరి ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి వరిసాగుపై రైతులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న కొండల్‌రెడ్డి

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో సీసీఎక్స్ పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు తడి, పొడి వరిసాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ కోఆర్డినేటర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ... తడి,పొడి సాగు విధానంతో కార్బన్, మీథేన్ వాయువుల విడుదల తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. రైతులు వరి సాగులో మెలకువలు పాటిస్తే దిగుబడితోపాటు పురుగు మందుల నివారణ ఖర్చులు తగ్గించుకోవచ్చాన్నారు. రైతు సమన్వయ సమితి మెంబర్ శ్రీనివాస్, రాజయ్య, కోఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మినారాయణ

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో హుజూరాబాద్ వెళ్లే క్రాసింగ్ వద్ద జీఎస్ఆర్ చలివేంద్రాన్ని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు లక్ష్మినారాయణ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, లీగల్‌సెల్ కో కన్వీనర్ సంపత్‌కుమార్, నాయకులు వంగర మల్లేశం, బోయిని ప్రశాంత్, ఎస్‌డీ షరీఫ్, వెంకన్న, శ్రీనివాస్, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

మైనర్‌లకు కౌన్సిలింగ్

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై చంద్రశేఖర్ మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కరీంనగర్–వరంగల్ రహదారిపై బైక్ డ్రైవింగ్ చేస్తున్న ఐదుగురిని తనిఖీల్లో పట్టుకున్నారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి మోటార్ వెహికిల్ చట్టం కింద వాహన యజమానులపై కేసులు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపు

- అభయహస్తం డబ్బుల కోసం మహిళల నిరీక్షణ
- 5,452 మంది నుంచి రూ.81.75 లక్షలు వసూలు
- పెన్షన్ కోసం రూ.3,650 చెల్లించిన 900 మంది
- 2014లో రద్దయిన పథకం, నిరాశలో మహిళలు


చిగురుమామిడిలో అభయహస్తం పథకంపై చర్చిస్తున్న స్వశక్తి సంఘాల మహిళలు

చిగురుమామిడి: మండలంలోని 17 గ్రామాలకు చెందిన స్వశక్తి సంఘాల మహిళలు చెల్లించిన అభయహస్తం ఇన్సూరెన్స్ డబ్బులకు అతీగతి లేకుండా పోయింది. ఏడాదికి రూ. 375 చొప్పున నాలుగేళ్ల పాటు ప్రతి మహిళ రూ.1500 చెల్లించారు. 5,452 మంది నుంచి ఐకేపీ సిబ్బంది రూ. 81.75 లక్షలు వసూలు చేసి అప్పటి ప్రభుత్వానికి చెల్లించారు. 2009లో ప్రారంభమైన పథకం 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత రద్దయింది. కానీ చెల్లించిన ఇన్సూరెన్స్ డబ్బులు నేటికి రాలేదు. ఈవిషయంపై పలుమార్లు ఐకేపీ సిబ్బందిని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని జవాబు చెప్పడంతో తీవ్ర నిరాశకు లోనవుతున్నారు.

900 మందికి వచ్చిన అభయహస్తం పెన్షన్ డబ్బులు

స్వశక్తి సంఘాల్లోని 51 నుంచి 60 ఏళ్ల నిండిన మహిళలు పదేళ్లకు సంబంధించి అభయహస్తం ఇన్సూరెన్స్ డబ్బులు రూ.3,650 చెల్లించారు. 61 సంవత్సరాలు నిండిన 900 మంది ప్రతినెల రూ.500 పింఛన్ పొందారు. పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద, మధ్య తరగతి మహిళల జీవన భృతికింద ప్రవేశపెట్టారు. మహిళల పిల్లలు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ చదివే వరకు ఏటా రూ.1200 ఉపకార వేతనాలు పొందారు. అటు పెన్షన్, ఇటు ఉపకార వేతనాలు అందించిన పథకం ఐదేళ్లు కొనిసాగిన అనంతరం రద్దు కావడంతో విద్యార్థులు నష్టపోతున్నారు.

ఆసరా పథకం కింద రెండు వేల పింఛన్ పొందుతున్నా అప్పుడు చెల్లించిన డబ్బులు ప్రభుత్వం ఇంకా ఇవ్వడంలేదని మహిళలు వాపోతున్నారు.

ఖాతాల్లో జమచేయాలి

వసూలు చేసిన డబ్బుల గురించి ప్రభుత్వం ఏ సమాధానం చెప్పకపోవడంతో చెల్లించన డబ్బుల సంగతేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అభయహస్తం పథకం కింద చెల్లించిన డబ్బులను తిరిగి ఖాతాల్లో జమచేయాలని స్వశక్తి సంఘాల మహిళలు కోరుతున్నారు.

నాలుగేళ్లు చెల్లించాను



నాలుగేళ్లు ఏటా రూ.375 చొప్పున రూ.1500 రూపాయలు చెల్లించాను. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పథకాన్ని రద్దు చేశారు. కానీ చెల్లించిన డబ్బులను ప్రభుత్వం నేటికి ఇవ్వడంలేదు. నాతోటి మహిళలందరు డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను.

– కంది పద్మ, స్వశక్తి సంఘం సభ్యురాలు, బొమ్మనపల్లి

డబ్బులు ఇప్పించాలి



అభయహస్తం పింఛన్ కోసం ఒకేసారి రూ.3,650 చెల్లించాను. ఒకనెల ఐదు వందల పింఛన్ పొందాను. తర్వాత పథకం రద్దయింది. డబ్బులు కట్టి దాదాపు పదమూడేళ్లు అవుతోంది. పలుమార్లు సంఘం అధ్యక్షులను అడిగినా ఫలితం లేదు. ఇప్పటికైనా మా డబ్బులు మాకు ఇప్పించాలి.

– పెద్దబత్తుల లచ్చవ్వ, స్వశక్తి సంఘం సభ్యురాలు, బొమ్మనపల్లి

వివరాలు ఉన్నతాధికారులకు పంపాం



మండలంలో అభయాస్తం పథకం కింద 900 మంది పెన్షన్ పొందారు. వారిలో దాదాపు 500 మంది ఆసరా పెన్షన్‌కు డైవర్ట్ అయ్యారు. మిగిలిన 400 మందికి పథకం కింద చెల్లించిన డబ్బులు రావాల్సి ఉంది. వారి వివరాలు జిల్లా ఉన్నత అధికారులకు పంపాం. డబ్బులు రాగానే వారి ఖాతాల్లో జమచేస్తాం.

– ఎం. సంపత్, ఏపీఎం, చిగురుమామిడి

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్


పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: మహిళలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా పథకం ప్రారంభమైందని, ప్రతి మంగళవారం ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శిశువు నుంచి వృద్ధుల వరకు సంక్షేమ ఫలాలు

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

చిగురుమామిడి: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పుట్టిన శిశువు నుంచి వృద్ధుల వరకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ఈ నెల 20న హుస్నాబాద్‌లో నిర్వహించే మంత్రి కేటీఆర్ బహిరంగ సభపై మంగళవారం చిగురుమామిడిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. గోదావరి జలాలను మండలానికి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ మండలానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, మంత్రి సభను విజయవంతం చేయాలని కోరారు. డెబ్బై ఏళ్లలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేసిందేమిలేదని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు అంజయ్య, ఎంపీపీ వినీత, జెడ్పీటీసీ రవీందర్, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లేశం, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రజితకృష్ణమాచారి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

రామడుగు: విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని మాస్టర్ ట్రైనర్ అనంతపద్మనాభస్వామి సూచించారు. మండలంలోని వెలిచాల సరస్వతి పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షల భయం వీడాలని, ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చన్నారు. చదువు ప్రాముఖ్యత, స్టడీ స్కిల్స్, మెమోరీ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కోకరస్పాండెంట్ సత్యం, ట్రైనర్ బాశెట్టి శ్రావణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు


పరీక్ష ప్యాడ్‌లు అందిస్తున్న సంస్థ నిర్వాహకులు

మానకొండూర్: ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ అన్నారు. మండలంలోని చెంజర్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేసి మాట్లాడారు. సంస్థ సభ్యుడు నక్క రాఘవేందర్ సులోచనల కూతురు జన్మదినం పురస్కరించుకొని పరీక్ష ప్యాడ్‌లు అందజేశామన్నారు. పరీక్షలకు భయపడితే ఒత్తిడికి గురవుతారని, సహచరులతో పోల్చుకోవద్దని, పరీక్షల గురించి అతిగా ఆలోచించొద్దని సూచించారు. 9.6 జీపీఏ నుంచి 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సంస్థ ద్వారా నగదు పారితోషికంగా అందజేస్తామని తెలిపారు. హెచ్ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు చొప్పదండికి చెందిన విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ ఉచితంగా పంపిణీ చేశారు.పరీక్షలపై భయం పోగొట్టుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

రామడుగు: మండలంలోని వెదిర, గోపాల్‌రావుపేట, కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అందజేసిన పరీక్ష సామగ్రిని ఎంపీపీ కలిగేటి కవిత మంగళవారం పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులను సాధించాలని కోరారు. మాజీ ఎంపీపీ కిష్టారెడి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ సంగీత, నాయకులు, పాల్గొన్నారు. రుద్రారం పాఠశాలలో విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు.

గంగాధర: మండలంలోని కురిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కరీంనగర్ స్టడీ మెటీరియల్ అందజేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు అందజేస్తామని టీచర్లు పేర్కొన్నారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా స్టడీ మెటీరియల్ రూపొందించామని తెలిపారు.

రామడుగు యువకుడికి పీజీ మెడికల్ సీటు



రామడుగు: రామడుగుకు చెందిన పి.సాయిప్రభాత్ పీజీ మెడికల్ సీటు సాధించాడు. మంగళవారం విడుదలైన నీట్ ఫలితాల్లో 4,900 ర్యాంక్ సాధించినట్లు గ్రామస్తులు తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సాయిప్రభాత్ ఎంబీబీఎస్ చదివాడు. తండ్రి భాస్కర్ కిరాణం షాపు నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి.

చిన్నారుల ఎత్తు, బరువు పర్యవేక్షించాలి

అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్


మట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

చొప్పదండి: ప్రతీ మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువు కొలవాలని, పిల్లల తల్లిదండ్రులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. మండలంలోని రాగంపేట ప్రాథమిక పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. పిల్లలపై కుటుంబ సభ్యులు శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు హిమోగ్లోబిన్ పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో నెలనెలా చేయించుకోవాలని కోరారు. మండలంలో పదహారు అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేవని, మంజూరుకు కృషి చేయాలని ఎంపీటీసీ సింగిరెడ్డి క్రిష్టారెడ్డి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల బిల్లులు రావడం లేదని తెలిపారు. అనంతరం గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి వేతనం, తాగునీటి సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. రహదారులకు ఇరువైపులా మొక్కల పెంపకం, సంరక్షణ చేపట్టాలని, పల్లె ప్రగతి స్ఫూర్తిని ప్రతి గ్రామంలో కొనసాగించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్, డీఆర్‌డీవో పీడీ సుజాత, ఉప వైద్యాధికారి వినీత, పద్మావతి, కస్తూరి, రమాదేవి, లత, తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడి: బైక్ ర్యాలీలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు

అనభేరి ప్రభాకర్‌కు నివాళి


తిమ్మాపూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

చిగురుమామిడి: భూస్వాములు, పెత్తందార్ల ఆగడాలను ఎదిరించడానికి పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ప్రాణాలు త్యాగం చేసినవారు చిరస్మరణీయులని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్‌రావు పోరు నేటికి మరువరానిదని, మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరితో పాటు సింగిరెడ్డి భూపతిరెడ్డి, మరో పదిమంది నిజాం హయాంలో అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని సుందరగిరి నుంచి మహ్మదాపూర్ వరకు బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి, సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మారెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేయాలి

తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి ఆధ్వర్యంలో అనభేరి ప్రభాకర్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూనే మరోపక్క గ్రామాల్లో దొరలు దేశ్‌ముఖ్, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప వీరుడు ప్రభాకర్‌రావు అని కొనియాడారు. మహానుభావుడిని ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని, త్యాగాలను గుర్తించడం లేదన్నారు. ఆయన పోరాటాలను పాఠ్య పుస్తకాల్లో చేర్పించాలని, ప్రభాకర్‌రావు విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు గట్టయ్య తిరుపతి, సంపత్ రెడ్డి, ఐలయ్య ప్రశాంత్ శివకుమార్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

హుజురాబాద్: పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన సిరికొండ వివేక్ ఇటీవల మృతి చెందగా, మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, అపరాధ ముత్యం రాజు, బీఆర్ఎస్ నాయకుడు గందె శ్రీనివాస్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం తెలిపారు.

మూఢనమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి

గంగాధర: యువత మూఢనమ్మకాలను వీడాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి ఉప్పులేటి నరేశ్, వైస్ ఎంపీపీ కంకణాల రాజగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో వికాస్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాసం–మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేష్ సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ స్వప్న, కార్యదర్శి శ్రీనివాస్, అలిపిరెడ్డి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బారినుంచి కాపాడాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న యువకులు

రామడుగు: మండలంలోని రుద్రారం, రంగసాయిపల్లి గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సర్పంచులు ఒంటెల అమరేందర్‌రెడ్డి, సాదు పద్మ, యువకులు ఎంపీటీసీ గుర్రం దేవికకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. కుక్కల దాడిలో వాహనాదారులు కిందపడి గాయాలపాలవుతున్నారని, చిన్నపిల్లలు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో యువకులు చిలుముల రమేష్, ప్రభాకర్, కనకయ్య, వినోద్, అనిల్, సుదర్శన్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

హుజూరాబాద్: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులు కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు రమ, శ్రీనివాస్, సుశీల, కుమార్, రమేష్, బీఆర్ఎస్ నాయకులు సమ్మయ్య, రాజేందర్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.

మల్యాల గ్రామంలో..

ఇల్లందకుంట: మండలంలోని మల్యాల గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సాంబయ్య ప్రారంభించారు. 131మందికి కంటి పరీక్షలు చేసి 22 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశామని డాక్టర్ తులసిదాస్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్నవారు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ జ్యోత్స్న, క్యాంపు ఇన్‌చార్జి డాక్టర్ దివిజ, హెల్త్ సూపర్‌వైజర్ అనిత, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ దామోదర్, ఏఎన్ఎంలు పద్మ, ఉమ, రేణుక, తిరుమల, కళావతి, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది ఉన్నారు.

వంకాయగూడెం జీపీ కార్యాలయంలో..

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం సర్పంచ్ గుర్రం లత ప్రారంభించారు. ఉపసర్పంచ్ మల్లేశ్, కార్యదర్శి నర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాట్రపల్లిలో..

హుజూరాబాద్‌రూరల్: కంటి వెలుగు శిబిరాలతో కంటి సమస్యలు దూరమవుతాయని సర్పంచ్ కాసగోని నిరోషా కిరణ్, ఎంపీటీసీ రావుల అనిత అన్నారు. మంగళవారం మండలంలోని కాట్రపల్లిలో కంటి వెలుగు శిబిరానికి ముఖ్య అతిథిలుగా హాజరై పరీక్షలు చేసుకున్న లబ్ధిదారులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.

ఇందుర్తి జీపీ కార్యాలయంలో ..

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ అందె స్వరూపస్వామి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురికి చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్‌తో కలిసి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ సతీష్, వార్డు సభ్యులు విష్ణమాచారి, శ్యామల, యశోద, విజయ, సిరాజ్, డా.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలి


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

గంగాధర: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని గంగాధర స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం తిరుపతిరావు సూచించారు. మండలంలోని బూర్గుపల్లి గవర్నమెంట్ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం లక్ష్మణ్‌కుమార్, అశోక్‌కుమార్, శ్యాంసుందర్, రోజరాణి, రత్నమాల, అంగన్‌వాడీ టీచర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com